క్లుప్తంగా

వర్షానికి కూలిన కోడూరు గ్రంథాలయం పైకప్పు

రాత్రి సమయం కావడంతో తప్పిన ప్రమాదం



జి.కొండూరు: గత కొన్ని రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు కోడూరు గ్రంథాలయ భవనంలోని ఒక గది పైకప్పు ఆదివారం రాత్రి కూలిపోయింది. ఈ గ్రంథాలయాన్ని 1985లో గ్రామస్తులు నిర్మించుకున్నారు. ఆ తర్వాత దీనిని గ్రంథాలయ శాఖ పరిధిలోకి తీసుకొని పుస్తక పంపిణీ కేంద్రంగా నిర్వహిస్తున్నారు. కాగా ఈ గ్రంథాలయానికి న్యూస్ పేపర్లు, పుస్తకాలను చదవుకునేందుకు ప్రతి రోజూ 20 నుంచి 30 మంది వరకు వస్తుంటారు. ఈ క్రమంలో పగటి వేళ పైకప్పు కూలి ఉంటే పెను ప్రమాదం జరిగేది. భవనం శిథిలావస్థకు చేరడంతో పైకప్పు కూలిందని, భవనాన్ని పూర్తిగా తొలగించి నూతన భవనాన్ని నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సహస్ర దీపాలంకరణసేవ

తిరువూరు: స్థానిక పాత తిరువూరు వేంకటాచలస్వామి దేవస్థానంలో వైశాఖ మాస శ్రవణ నక్షత్ర సందర్భంగా సహస్ర దీపాలంకరణ సేవ, ఊంజల సేవ నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు దేవయాజనం వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించిన అనంతరం భక్తులు సహస్ర దీపాలంకరణలో పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

జి.కొండూరు: వెలగలేరు వేణుగోపాలస్వామి ఆలయం వద్ద పరంజ్యోతి కల్కి సేవా సమితి విజయవాడ ఆధ్వర్యంలో ఉపాధి కూలీలు, వాహన చోదకులకు సోమవారం మజ్జిగ పంపిణీ చేశారు. సేవా సమితి సభ్యులు నాగేశ్వరరావు, ఫణీంద్ర, రాధాకృష్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

చదరంగంలో శిక్షణ



మైలవరం: చదరంగం విద్యార్థుల మేధస్సుకు పదును పెడుతుందని చదరంగం నిపుణులు ఆదూరి సురేష్‌బాబు అన్నారు. మైలవరం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు చదరంగంలో శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ చదరంగం క్రీడలోని మెలకువలను వివరించారు. చదరంగంలో ఏ విధంగా విజయం సాధించాలి అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు చదరంగంలో పోటీలు నిర్వహించారు. విద్యార్థినీ, విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై కళాజాతా ప్రదర్శన



నూజివీడు: హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాప్తి చెందే విధానం, వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో నూజివీడు పట్టణంలోని శ్రీనివాస సెంటర్‌లో సోమవారం కళాజాతా బృందం ప్రచారం నిర్వహించింది. దీనిలో భాగంగా ఎల్‌ఆర్ కృష్ణబాబు బృందం వీధి నాటిక ప్రదర్శన ద్వారా ప్రజలకు అవగాహన కల్పించింది. కార్యక్రమంలో యూనిట్ ప్రాజెక్ట్ మేనేజర్ ఎం.లక్ష్మి, ఆశా వర్కర్లు, ఏఎస్‌ఎంలు పాల్గొన్నారు.

అంకమ్మ తల్లి విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవం

మైలవరం: రెడ్డిగూడెం మండలం నాగులూరు గ్రామంలోని అంకమ్మ తల్లి విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు సోమవారం గణపతి పూజతో ప్రారంభమయ్యాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం స్వామివార్ల విగ్రహాలు ఊరేగింపు, బుధవారం ఉదయం 8.10 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

సారా తయారీదారుడి అరెస్ట్

చాట్రాయి: సారా తయారు చేస్తున్న వ్యక్తులను అరెస్టు చేశామని నూజివీడు ఎక్సైజ్ ఎస్‌ఐ మస్తానరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని పోతనపల్లి తండాకు చెందిన మాలావతు శ్రీనివాస్ గతంలో ఎక్సైజ్ నేరాలకు పాల్పడడంతో అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం తిరువూరు కోర్టుకు తరలించామన్నారు.

అప్రమత్తతతో నియంత్రణ

- చిన్న చిన్న పొరపాట్లతో భారీ అగ్నిప్రమాదాలు
- ముందస్తు జాగ్రత్తలతో ప్రమాదాలకు చెక్
- వేసవిలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు





కంద్రికలో జరిగిన అగ్నిప్రమాదంలో పూర్తిగా కాలిపోయిన ఇల్లు (ఫైల్) : కడింపోతవరం వద్ద ఐటీసీఎల్ సమీపంలో కాలిపోతున్న ఆయిల్ ట్యాంకర్ లారీ (ఫైల్)

జి.కొండూరు: సిగరెట్, బీడీలు తాగి ఆర్పకుండా పడవేయడం, మండే పదార్థాలు ఇంట్లో ఉంచడం, కరెంట్ వైరింగ్ సరిగా లేకపోవడం, గ్యాస్ పైప్‌లైన్ పాతవి అయినా మార్చకుండా అలాగే వినియోగించడం.. ఇలా చిన్నచిన్న పొరపాట్లే భారీ ప్రమాదాలకు దారితీస్తున్నాయి. మానవ తప్పిదాలతో జరిగే భారీ అగ్ని ప్రమాదాలతో ఎన్నో జీవితాలు తల్లకిందులయ్యాయి. సర్వం కోల్పోయి, భారీ ఆస్తి నష్టం వాటిల్లి రోడ్డున పడిన కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించి అప్రమత్తంగా ఉంటే అగ్ని ప్రమాదాల భారి నుంచి తప్పించుకోవచ్చు.

ముందస్తు జాగ్రత్తలు ఇవి..

- అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు మంటలు వ్యాపించకుండా అదుపు చేయాలి.
- ప్రతి ఒక్కరూ తమ ఇంట్లో విద్యుత్ వైరింగ్ సరిగ్గా ఉందో, లేదో చూసుకోవాలి. వైరింగ్ సమస్య ఉంటే వెంటనే సరి చేయించుకోవాలి.
- గ్యాస్ సిలిండర్లు, పైపులు, లేదా ఇతర గ్యాస్ పరికరాలలో లీకేజీ సమస్యలు లేకుండా చూసుకోవాలి. లీకేజీ ఉంటే ఆ వస్తువులను మార్చడం లేదా రిపేర్ చేయించాలి.
- మండే అవకాశం ఉన్న వస్తువులు, పదార్థాలను జాగ్రత్తగా నిల్వ చేయాలి. బాణసంచా, పెట్రోల్, డీజిల్ వంటి పదార్థాలను ఇళ్లల్లో నిల్వ చేయకూడదు.
- గ్రామీణ ప్రాంతాలో ధూమపానం చేస్తున్న వ్యక్తులు సిగరెట్, చుట్ట, బీడీ వంటి వాటిని కాల్చిన తర్వాత పూర్తిగా ఆర్పివేయాలి.
- వ్యవసాయ భూముల్లో వ్యర్థాలను కాల్చే సమయంలో దగ్గరుండి మంటలు ఆర్పిన తర్వాతే ఇంటికి వెళ్లాలి.
- పరిశ్రమలు, అపార్టుమెంట్లు, కార్పొరేట్ భవనాల్లో అగ్నిమాపక వ్యవస్థను తప్పక ఏర్పాటు చేసుకోవాలి.

గత కొన్నేళ్లుగా మైలవరం ఫైర్ స్టేషన్ పరిధిలో జరిగిన ప్రమాదాల వివరాలు

సంవత్సరం	ప్రమాదాల సంఖ్య
2016–17	79
2017–18	55
2018–19	66
2019–20	64
2020–21	62
2021–22	40
2022–23	62
2023–24	95
2024–25	93

గతంలో జరిగిన కొన్ని ఘటనలు..

- జి.కొండూరు విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రాంగణంలో విద్యుత్ లైన్ షార్ట్ సర్క్యూట్ వల్ల నిప్పు రవ్వలు పడి ప్రాంగణంలో ఉన్న ఎండుగడ్డి తగలబడింది.
- జి.కొండూరు మండలం కోడూరు శివారు కంద్రిక గ్రామంలో అన్నదమ్ములు గొర్నెపూడి చలపతిరావు, దుర్గారావులకు చెందిన రెండు ఇళ్లలో విద్యుత్ షార్టు సర్క్యూట్ వల్ల అగ్నిప్రమాదం జరిగి రెండు ఇళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. దుర్గారావు కుటుంబానికి చెందిన రూ.96,260 విలువ గల కరెన్సీ నోట్లు, 5 కాసుల బంగారం, చలపతిరావు కుటుంబానికి చెందిన రూ.78 వేల విలువ గల కరెన్సీ నోట్లు, ఇళ్లలో సామాన్లు పూర్తి దగ్ధమయ్యాయి.



కంద్రికలో జరిగిన అగ్నిప్రమాదంలో కాలిపోయిన కరెన్సీ నోట్లు (ఫైల్)

- కట్టుబడిపాలెం శివారు గ్రామం కడింపోతవరం వద్ద ఐటీసీఎల్ కంపెనీ సమీపంలో ఆయిల్ రవాణా చేసే లారీలో చెలరేగిన మంటలకు లారీ ముందు భాగం పూర్తిగా కాలిపోయింది. ఆయిల్ లోడింగ్‌కి వచ్చిన వాహనం రహదారి పక్కన నిలిపి ఉంచి డ్రైవర్ స్నానానికి వెళ్లగా లారీ క్యాబిన్‌లో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదం జరిగినప్పుడు ట్యాంకర్‌లో ఆయిల్ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

ఒకే ఒక్క అగ్నిమాపక యంత్రం

మైలవరం నియోజకవర్గంలోని మైలవరం, రెడ్డిగూడెం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని కొండపల్లి ప్రాంతం వరకు ఒకే ఒక్క అగ్నిమాపక యంత్రం అందుబాటులో ఉంది. దీనితో ప్రమాదాలు జరిగినప్పుడు ఈ యంత్రం ఘటనా స్థలానికి చేరుకునే లోపే తీవ్ర ఆస్తి నష్టం వాటిల్లుతోంది.

జి.కొండూరులోని గెయిల్ ఇండియా కంపెనీ, కొండపల్లి లాన్కోలో ఉన్న అగ్నిమాపక యంత్రాలను అప్పుడప్పుడు ఆ కంపెనీలకు సమీపంలో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు వినియోగిస్తున్నారు.

వేసవిలో అప్రమత్తంగా ఉండాలి



వేసవిలో అగ్ని ప్రమాదాల తీవ్రత ఎక్కువగా ఉంటుంది. పిల్లలకు లైటర్లు, అగ్గిపెట్టెలు దొరక్కుండా చూసుకోవాలి. వ్యవసాయ భూముల్లో వ్యర్థాలను తగలబెట్టే సమయంలో దగ్గరుండి ఆర్పిన తర్వాతే ఇంటికి వెళ్లాలి. లేదంటే మంటలు గాలి ద్వారా వ్యాపించి ప్రమాదాలు జరుగుతాయి. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే 101కి ఫోన్ చేసి సమాచారం అందించాలి.

– గౌతమ్, అగ్నిమాపకశాఖ అధికారి, మైలవరం

అర్జీలను గడువులోగా పరిష్కరించాలి

సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్



సబ్ కలెక్టర్ కార్యాలయంలో అర్జీదారునితో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్

నూజివీడు: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరించాలని సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ అధికారులను ఆదేశించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వారి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో 16 అర్జీలు రాగా సంబంధిత అధికారులకు పరిష్కారం నిమిత్తం పంపించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చిలుకూరి భాస్కరరెడ్డి, డీఎల్‌డీఓ వెంకటరత్నం, డీఎల్‌పీఓ సుందరి, హెచ్‌ఓఆర్ హేమ, ఏఓ శివశంకర్, సర్వే డీఐ రంగారావు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వచ్చిన అర్జీల్లో కొన్ని..

- నూజివీడు పట్టణ పరిధిలోని బైపాస్ రోడ్డులో తనకు 2.07 ఎకరాల పల్లపు భూమి ఉందని, అయితే తన భూమి వివరాలు వెబ్‌ల్యాండ్‌లో కనిపించడం లేదని, సంబంధిత అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని పట్టణానికి చెందిన దాసరి సత్యనారాయణ అర్జీ అందజేశారు.
- తమ తండ్రి కొక్కెరగడ్డ దేవదత్తం పేరు మీద చాట్రాయి మండలం పోలవరంలో 1.50 ఎకరం భూమిలో మొలుగుమాటి బాబూరావు అనే వ్యక్తి 20 సెంట్లు ఆక్రమించుకొని తమపై దౌర్జన్యం చేస్తున్నాడని, చర్యలు తీసుకోవాలని కొక్కెరగడ్డ హనో అర్జీ అందజేశారు.
- నా పేరున ఆగిరిపల్లి మండలం వట్టిగుడిపాడులో ఇల్లు, 1.75 ఎకరాల భూమి ఉందని, అయితే ఇంటిలో నాతోపాటు ఉంటున్న నా కుమారుడు, కోడలు తనను ఇంటిలో నుంచి వెళ్లిపొమ్మని దౌర్జన్యం చేస్తున్నారని, తన బాగోగులు పట్టించుకోవడం లేదని, న్యాయం చేయాలని కోరుతూ యలమర్తి సుగుణరావు అర్జీని అందజేశారు.

ఓటమి భయంతోనే టీడీపీ దౌర్జన్యం

మీడియా సమావేశంలో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు, నాయకులు



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు

తిరువూరు: వైఎస్సార్ సీపీకే తిరువూరు నగర పంచాయతీ కౌన్సిల్ చైర్‌పర్సన్ పదవి దక్కుతుందని తెలిసే ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు దౌర్జన్యానికి పాల్పడటం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు, నాయకులు అన్నారు. సోమవారం వారు మీడియాతో మాట్లాడారు. 15వ వార్డు కౌన్సిలర్ మోదుగు ప్రసాద్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు తోటి ప్రజాప్రతినిధులను అవమానించే రీతిలో వ్యవహరించం సరికాదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజలంతా దీనిని గమనిస్తున్నారని చెప్పారు.

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారు..

వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు నగర పంచాయతీ చైర్‌పర్సన్ ఎన్నికలో పాల్గొనకుండా ఉండేందుకు తెలుగుదేశం పార్టీ అరాచకంగా వ్యవహరించిందన్నారు. కౌన్సిలర్లను నడిరోడ్డుపై అడ్డుకుని గంటల తరబడి సమయం వృథా చేసి ప్రజాస్వామ్యంలో ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు

కౌన్సిలర్లకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు తిరువూరు నగర పంచాయతీ ఎన్నికల్లో ఏకపక్షంగా వ్యవహరించారని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి అన్నారు. కౌన్సిలర్లను దారుణంగా అడ్డుకుని చెప్పులు, వాటర్ బాటిల్స్ విసురుతూ, నీళ్లు జల్లుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరించే టీడీపీ నాయకులకు పోలీసులు వత్తాసు పలకడం హేయమన్నారు. కౌన్సిలర్లను నగర పంచాయతీ కార్యాలయానికి పంపకుండా పోలీసులు పని చేశారని విమర్శించారు.

రోడ్డుపై ఎన్నిక జరపండి

కౌన్సిలర్లను నగర పంచాయతీ కార్యాలయంలోకి అనుమతించడంలో అధికార యంత్రాంగం విఫలమైనందున రోడ్డుపైనే ఎన్నిక జరపాలని రెండో వార్డు కౌన్సిలర్ వెలుగోటి విజయలక్ష్మి అన్నారు. ఆర్డీఓ బయటికి వచ్చి మా ఇబ్బందులు గమనించాలని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదన్నారు. ప్రజలు ఎన్నుకున్న మమ్మల్ని అన్ని విధాలా అవమానాలకు గురిచేయడం ఎమ్మెల్యేకి ఎంత వరకు సబబని ప్రశ్నించారు. గంటన్నర సేపు మండుటెండలో వేచివున్నా అధికారులు స్పందించలేదని విమర్శించారు. చైర్‌పర్సన్ ఎన్నికకు కౌన్సిలర్లను రానీయకుండా అడ్డుకోవడంపై అధికారులు సమాధానం చెప్పాలన్నారు.

ఆదర్శప్రాయుడు పుచ్చలపల్లి సుందరయ్య

వర్ధంతి కార్యక్రమంలో నేతల నివాళి

మైలవరం: నేటి తరం రాజకీయాలకు పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శప్రాయులని సీపీఎం మైలవరం మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయ ప్రాంగణంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. సుధాకర్ మాట్లాడుతూ సమసమాజ నిర్మాణమే లక్ష్యంగా పుచ్చలపల్లి సుందరయ్య పోరాడారని చెప్పారు. ప్రజా శ్రేయస్సే కర్తవ్యంగా నడిచిన నిరాడంబర, నిబద్ధత గల వ్యక్తి అన్నారు. పేదల అభ్యున్నతికి శ్రమించారని చెప్పారు. సీపీఎం నాయకులు వజ్రాల వెంకటరెడ్డి, రావుల సుబ్బారావు, రావూరి రమేష్, సీహెచ్ రాజారెడ్డి, ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు, వివిధ రంగాల కార్మిక నాయకులు పాల్గొన్నారు.

- **కొండపల్లి(ఇబ్రహీంపట్నం):** కొండపల్లిలో సీపీఎం శ్రేణులు పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి ఎం.మహేష్ మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య ఉత్తమ పార్లమెంటేరియన్‌గా, ఉత్తమ సేవకుడిగా పేద ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందించారని కొనియాడారు. తన యావదాస్తిని పేదలకు పంపిణీ చేశారన్నారు. కరువు, కాటకాలు వచ్చిన సమయంలో కిలో బియ్యం రూపాయికి అందించి తన దాతృత్వం చాటుకున్నారని చెప్పారు. గన్నవరం విమానాశ్రయానికి సుందరయ్య పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. పట్టణ కమిటీ సభ్యులు ఎ.విఠల్‌రావు, వి.మురళీమోహన్, ఎస్‌కే బాష, పి.కామేశ్వరరావు, ఎల్. పార్వతి, బేబీసరోజిని పాల్గొన్నారు.
- **ఆగిరిపల్లి:** ఆగిరిపల్లిలోని సుందరయ్య భవన్‌లో సీపీఎం, సీఐటీయూ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



ఆగిరిపల్లిలో నివాళులర్పిస్తున్న నాయకులు



కొండపల్లిలో నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



మైలవరంలో నివాళులర్పిస్తున్న నాయకులు, కార్యకర్తలు

కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జి.రాజు, నాయకులు సత్తు కోటేశ్వరరావు, ముత్యాల నరేష్, నైనవరపు ఉల్లక్కయ్య, బండి కోటయ్య, ఎస్‌కే బాషా, సాదం ప్రసాద్ పాల్గొన్నారు.

- **తిరువూరు:** తిరువూరు సుందరయ్య కాలనీలో సుందరయ్య చిత్రపటానికి సీపీఎం నాయకులు మాచిబోయిన లక్ష్మీనారాయణ, నాయకులు మేకల నాగేంద్రప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గుంతల రోడ్డుతో ఇక్కట్లు

నూజివీడు: పట్టణంలోని పెద్ద గాంధీ బొమ్మ సెంటర్ నుంచి సింగ్ హోటల్ సెంటర్‌కు వచ్చే వన్‌వే రహదారి గుంతలమయంగా మారింది. రాకపోకలకు వాహన చోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ మార్గంలో ఎన్నెస్పీ గేటు నుంచి ద్వారకా థియేటర్ వరకు అడుగడుగునా గుంతలు ఏర్పడడంతో వాహనదారులు గుంతలను తప్పించే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నారు. ఎదురుగా వాహనాలు వచ్చినప్పుడు తప్పుకునేందుకు వీలు లేక వాహనాలను గుంతల్లోకి దింపాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. ఇటీవల మున్సిపల్ అధికారులు పెద్దగా ట్రాఫిక్ లేని అంతర్గత వీధుల్లోని తారురోడ్లపై పడిన గుంతలను పూడ్చించారు తప్ప నిరంతరం వాహనాలు రాకపోకలు సాగించే ఎంతో అవసరం ఉన్న ఈ రోడ్డులోని గుంతలను మాత్రం పూడ్చించలేదు. మరో వైపు గుంతలు లేని రోడ్లే మా లక్ష్యం అంటూ ముఖ్యమంత్రి చేసే ప్రకటనలు నూజివీడు పట్టణానికి వర్తించవా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి గుంతలను పూడ్చించాలని ప్రజలు కోరుతున్నారు.



నూజివీడు సత్యనారాయణ థియేటర్ రోడ్డుపై ఏర్పడిన గుంతలు

● ముంపులో ప్రభుత్వ కార్యాలయాలు





నీటి ముంపునకు గురైన ఎంపీడీఓ కార్యాలయం : ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయంలోకి చేరిన నీటిని మోటార్ సహాయంతో బయటకు పంపుతున్న సిబ్బంది



భవనంపై చెట్టు నీడన విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు

ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణం నీటి ముంపునకు గురయ్యాయి. ఎంపీడీఓ కార్యాలయం చుట్టూ సుమారు రెండడుగుల మేర నీరు నిలిచింది. సోమవారం వివిధ పనులపై వచ్చిన ప్రజలు వర్షం నీటిలో నడవలేక అవస్థలు పడ్డారు. తహసీల్దార్ కార్యాలయంలో గదులన్నీ నీటితో నిండాయి. కార్యాలయ సిబ్బంది కూర్చుని విధులు నిర్వహించేందుకు అవకాశం లేకుండా పోయింది. తహసీల్దార్ చాంబర్‌లోకి భారీగా నీరు చేరడంతో తహసీల్దార్ వెంకటేశ్వర్లు భవనంపై కుర్చీ వేసుకుని విధులు నిర్వహించారు. అవసరమైన పత్రాలపై సంతకాలు చేశారు. గత ఏడాది ఆగస్టులో వచ్చిన అధిక వర్షానికి కూడా రెండు కార్యాలయాలు నీటి ముంపునకు గురయ్యాయి. ప్రభుత్వ కార్యాలయాలు నీటి ముంపునకు గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

– ఇబ్రహీంపట్నం

నేడు మండల పరిషత్ సమావేశం

విస్సన్నపేట: విస్సన్నపేట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం జరుగుతుందని ఎంపీడీఓ చేకు చిన్న రాట్నాలు తెలిపారు. ఉదయం 11 గంటలకు వెలుగు కార్యాలయంలో ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో అధికారులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొనాలని కోరారు.

పోలీసులపై దౌర్జన్యం చేసిన వ్యక్తి అరెస్టు

చాట్రాయి: పోలీసులపై దౌర్జన్యం చేసిన వ్యక్తిని అరెస్టు చేశామని ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని పోలవరం గ్రామంలో ఆదివారం రాత్రి గొడవ జరుగుతుందని ఫోన్ కాల్ రావడంతో వెళ్లామని, అక్కడ ఉన్న ఓ వ్యక్తి పోలీసులపై గొడవ పెట్టుకుని విధులకు ఆటంకం కలగించినందున కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం తిరువూరు కోర్టుకు తరలించామని చెప్పారు. కోర్టు వారు జూన్ రెండో తేదీ వరకు నిందితుడికి రిమాండ్ విధించారని చెప్పారు.

ఆర్‌సీఎం విచారణ దేవాలయ ముఖద్వారం ప్రారంభం

మైలవరం: మైలవరం శాంతినగర్‌లోని ఆర్‌సీఎం విచారణ దేవాలయం ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన ముఖ ద్వారం (ఆర్చి)ని విజయవాడ కథోలిక మేత్రాసన మోన్సిగ్నోర్ రెవరెండ్ ఫాదర్ మువ్వల ప్రసాద్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దివ్య బలిపూజ నిర్వహించారు. అనంతరం 30 మంది బాల బాలికలకు దివ్య సత్ప్రసాదం అందజేశారు. అన్నదానం చేశారు. విచారణ గురువు కె. అనిల్ ఫ్రాన్సిస్, అతిథి గురువులు రెవరెండ్ ఫాదర్ బి. జాన్ పీటర్, ఫాదర్లు వినయ్, సీహెచ్ శౌరి, ఎన్. జ్ఞానేసు, జోజిరెడ్డి, లిటిల్ ఫ్లవర్ కాన్వెంట్ సిస్టర్స్, ఉపాధ్యాయ ఉపదేశకులు, సంఘ పెద్దలు, మరియ దళ సభ్యులు పాల్గొన్నారు.